# ముందు కూసిన కోయిల

సూర్యుడింకా రాలేదు.

అతని పైలట్ - వెలుగు మాత్రం వొస్తూంది మెల్లమెల్లగా.

ప్రభాతవేళ.

నగరంలో అధిక భాగం ఇంకా మత్తులోనే జోగుతోంది. నిద్రమత్తులో.

పనిమనుషులూ... పేపర్ బోయ్‌లూ... పాల పంపిణీదార్లూ ఇత్యాదులప్పటికే కార్యరంగంలోకి దిగిపోయారు.

ఆ ఏరియా - నగరం నుంచి విసిరివేయబడ్డట్లు విడగొట్టినట్లు మూలగా ఉంది. ఆ మారుమూల ప్రాంతంలో-

అదొక సిటీ బస్టాప్. ఆర్టీసీ కట్టించింది కాదది. ఒక సినీనటుడి అభిమాన సంఘం వాళ్ళు కట్టించారు రెండేళ్ళ కిందట. ఆ స్టాప్‌కొచ్చే బస్సులు తక్కువ. అంచేత అక్కడికొచ్చే ప్రయాణీకులూ క్కువే. అదీకాక... తూరుపు తెల్లారకుండా అంత పొద్దున్నే ఎవరొస్తారూ? కాని... గోపాలం వచ్చాడు. అహ... రావలసి వచ్చింది. ఒక స్నేహితుడికి తన అడ్రస్ పట్టుకోలేని వాడికి ఆ బస్టాప్‌ని ఆ సమయంలో వెన్యూగా ఇచ్చిన తొందరపాటు చర్యవల్ల తన నివాసానికి అదే దగ్గర కదాని అక్కడికొచ్చి కలుసుకోమన్నాడు.

నగరంలో దగ్గరంటే అది ఎంతేనా కావొచ్చు. స్వంత వాహనమున్నవాళ్ళ కెంత దూరమయినా దగ్గరే. గోపాలానికి సైకిల్ కూడా లేదు. అతని రెండు కాళ్ళే రెండు చక్రాలు. ఆ స్టాపు కతనిల్లు ఒకటిన్నర కిలోమీటర్లు మాత్రమే. ఒక ముఖ్యమైన వ్యవహారం మీద అతనూ ఆ మిత్రుడూ ఈ స్టాప్‌లో కలుసుకొని మరో చోటుకి వెళ్ళాలి ఇద్దరూ కలిసి. టైము ప్రకారం జరగాలి.

నగరాలలో - కరెన్సీ తరువాత అత్యంత విలువైనది కాలమే. అది తెలిసినవాడు కనకనే - అంత ఉదయమే... ఎంతో శ్రమ అయినా... తుడికిచ్చిన టైముకి టంచనుగా బస్‌స్టాప్ చ్చేశాడు. ఐతే... సదరు మిత్రుడు అక్కడికింకా రాలేదు. కనుచూపు మేరలో కానరావడమూ లేదు.

విరహము కూడా సుఖమే కాదా అన్నాడో సినీకవి. కాని... గోపాలం ఎదురుచూపు ప్రేయసి కోసం కాదు కదా? మగ స్నేహితుడి కోసం... ప్రేమ కోసం కాక వ్యాపార పని నిమిత్తం. కనుక అతనికి క్షణమొక యుగంగా గడుస్తోంది నిరీక్ష. అసలే అతనిది - తిట్టే నోరూ తిరిగే కాలూ లాగే మెలకువగా ఉంటే ఏదో ఒకటి చేస్తూంటే తప్ప ఉండలేని తత్వం. అంచేత అతనికీ ఎదురుచూపు - చించుకున్నట్లుగా ఉంది. చేయడానికి పనేమీ కనిపించక.. ఊరికే నిలబడవలసి రావడంతో కరచరణాలకు క్రూడాయిల్ రాసుకున్నట్లుంది.

అప్పుడు చూశాడతనటువేపు. అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్నన్నట్లు - తన కంటే ముందుగానే... బస్ షెల్టర్‌లో - ఒక పెద్దమనిషి! అక్షరాలా... నిజంగానూ కూడా పెద్దమనిషే. ఎందుకంటే - ఆయన వయసు పెద్దది. తనువు పెద్దది... మరియూ మీసములూ బొజ్జా కూడా పెద్దవే. తిట్టే నోరూ, తిరిగే కాలూ, గోపాలమూ ఊరకనే ఉండలేరని ముందే విన్నవించడమయింది కదా... అద్దాని ప్రకారం... అతను ఆయనను కదపడానికి తను అటువేపు కదిలాడు.

'నమస్కారమండీ... చూడబోతే తమరు చాలాసేపట్నుంచీ ఎదురుచూస్తున్నట్లున్నారు. ఏ నంబరు బస్సు కోసమో తెలుసుకోవచ్చునా?' వినయంగా అడిగాడు. అంతే. ఆ పెద్దాయన ఒక్కసారిటు తిరిగాడు. కళ్ళజోడు అద్దాలలోంచే కటిక నిప్పులు కురిపిస్తూ-

'ఏం? ఎందుకూ? ఏ బస్సో చెబితే ఎదురెళ్ళి తీసుకొస్తావా?' అంటూ కసురుతూంటే - నివ్వెరపోయిన గోపాలం... 'అదికాదండీ...' అంటూ ఏదో చెప్పబోయాడు.




'కానిదెందుకూ, ఐనదేదో చెప్పేడవక? ఛీ! పాడుకాలమొచ్చి పడింది. మనుషులు ఒక్క నిముషమేనా తాము మౌనంగా ఉండరు, ఎవరినీ ఉండనివ్వరు. శబ్దకాలుష్యం... వాక్కాలుష్యం...' అంటూ రెండో పేరాలో కూడా రెచ్చిపోయారు.

ఇందాకా నివ్వెరపోయిన గోపాలం - ఈసారి నిర్ఘాంతపోతూ... 'అంత కోపమెందుకండీ? పెద్దవారు... నేనేం చేశాననీ?' దీనంగా అడిగాడు.

'చేసిందంతా చేసేసి... ఇంకా ఏం చెయ్యాలి? బస్సొచ్చేవరకూ భగవద్ధ్యానం చేసుకుందామనుకుంటే భంగం చేసి...' అరిచినంత పనిచేశారు పెద్దాయన.

ఆశ్చర్యపోయాడు గోపాలం. 'క్షమించండి. బస్టాపులో భగవద్ధ్యానాలూ బార్‌లో భగవద్గీతలూ ఉంటాయని ఊహించలేకపోయాను. ఐనా... మానవసేవే మాధవసేవని...' అతన్ని వాక్యం పూర్తి చేయనివ్వకుండా గయ్యిన లేచాడాయన. 'అంటే? దేముణ్ణి ప్రార్థించడం మానేసి నీకు సేవ చేయమనా? అలాగే బాబూ... రా... సుస్వాగతం... నిలుచోలేక నీకు కాళ్ళు పీకుతున్నాయా? పాదసేవ చేయమంటావా? వేడివేడి టీ తెచ్చిపెట్టేదా?' ఆ వెటకారానికీ నటనా కౌశలానికీ మతిపోయింది గోపాలానికి. పెద్దవాళ్ళు కూడా ఇలా కుర్రతనపు ప్రవర్తన ప్రదర్శిస్తారన్నమాట. కదిపితే చాలు కందిరీగల పుట్టలాటి వాళ్ళు పెద్దమనుషుల్లా కనిపించే వాళ్ళలోనూ ఉంటారన్నమాట - అనుకుంటూ 'క్షమించండి. పెద్దవారు కదా... నాలుగు మంచి మాటలు చెబుతారని...' నీళ్ళు నమిలాడు.

'అంటే నీ కంటికి నేను పోచికోలు కబుర్ల రాయుళ్ళా కనిపిస్తున్నానన్నమాట. ఆ... ఏంటీ? నాలుగు మంచి మాటలు కదూ చెప్పమన్నావు... అమ్మ... ఆవు... అమృతము... నేను... చెప్పేశాను. ఇక నువ్వు నాతో ఒక్కమాట మాట్లాడినా మర్యాదక్కదు' అని గద్దించాడు. పలకరించడమే పరమ పాపమైపోయిందే! హు... మంచికీ మర్యాదకీ మంచినీళ్లూ మంచి మాటలూ పుట్టవని నిరూపించారుగా! ఇంకా మాట్లాడతానా? నువ్వు పెద్దాయనవి కావు. ఎద్దాయనవి... మొద్దాయనవి... ఎద్దు మొద్దాయనవి. పయోముఖ విషకుంభానివని వ్యవహారికంలోనూ గ్రాంధికంలోనూ కూడా - మనసులో తిట్టుకుంటూండగా - ఆ పెద్దమనిషి బస్సొచ్చి వెళ్ళిపోయాడు. గోపాలం అది గమనించనే లేదు.

ఆ మిత్రుడు వొస్తాడా, చెయ్యిస్తాడా? వొస్తే ఎప్పుడొస్తాడు? ఇంకా ఎంతసేపు తనకీ నిరీక్షణా శిక్ష? - అని తనని తానే సమాధానం రాని ప్రశ్నలు వేసుకుంటూండగా -

ఓ ఆటో ఆగింది. దాన్లోంచి ఓ తలకాయ తొంగి చూసింది. ఓ చెయ్యి - కాగితం ముక్కొకటందించి - 'ఈ డోర్ నంబర్ ఎక్కడో చెప్పగలరా?' అని అడిగింది.

'ఏ డోర్ నంబరేనా - డోర్ మీదుంటుందని చెప్పగలను. ఎడనెడ ద్వారబంధం మీదా, గోడమీద కూడా ఉండొచ్చు. ఈ కాలనీలో... మా కాలనీలో డోర్‌నంబర్‌ని బట్టి ఇల్లు కనుక్కున్న వాడికి అసాధ్యుడనే బిరుదిచ్చెయ్యొచ్చు. మీ అదృష్టాన్ని మీరే పరీక్షించుకోండి' అంటూ అడ్రస్ స్లిప్‌ని ఆ చేతికే ఇచ్చేసి - డోర్ నంబర్‌నిబట్టి ఇల్లు కనుక్కోగలిగితే మిత్రుడి కోసం నేనిక్కడిన్ని పాట్లూ మాటలూ ఎందుకు పడతానూ? ఒకసారొచ్చిన వాళ్ళే మళ్ళీ రాలేరు, అంత మహత్తరమైనది మా కాలనీలో డోర్ నంబర్ల సంగతి - అని స్వగతంలో అనుకున్నాడు.

'అయ్యో!' అని వినిపించింది గోపాల్ అనుకోడమూ గట్రా పూర్తి చేసి అనుకున్నాక.

'నా పేరయ్య కాదు' అన్నాడు పెంకితనంగా.

'నా పేరు మాత్రం సూరయ్య'

'నీ పేరు సూరయ్యయినా చంద్రయ్యయినా నాకనవసరం'

'మీ కవసరమో అనవసరమో నా కనవసరం.... తెలియ కడుగుతున్నానూ'

'ఎవరేనా తెలియకే అడుగుతారు'

సూరయ్య పళ్ళికిలించి - 'మా బాగా చెప్పారు. ఇర గబడి నవ్వేయాలనిపిస్తూంది. అద్సరే. బస్సులేమో ఎక్కడో ముందో వెనకో ఆగుతూంటే - మనం నిలుచున్న దీన్నెందుకూ బస్టాప్ అంటున్నారూ?' అడిగాడు.

'మీది ధర్మసందేహం కనక చెబుతున్నాను. బస్సుల కోసం ప్రయాణీకులు నిలుచునే స్థలమే తప్ప - బస్సులు నిలుచునే స్థలం కాదని ఆర్టీసీ వాళ్ళ భాష్యం - బస్టాప్‌కి'

'హ్హిహ్హిహ్హి... బలేగా చెప్పారరటిపండొలిచి నోట్లో పెట్టినట్లు' మెలికలు తిరిగిపోయాడు.

'దీన్లో అంత నవ్వి పడిపోడానికేముంది?' విరుచుకు పడ్డాడు గోపాలం.

'నవ్వు నా జన్మహక్కండి. నా బస్సొచ్చేస్తూంది. నేను లగెత్తుతానండి..' అంటూ నవ్వుతూ పారిపోయాడు సూరయ్య.

మిత్రుడి మీద చిరాకేసేస్తూంది గోపాలానికి. కాలం విలువ తెలియని వాడు... అన్నింటిలోనూ ఇండియన్ పంక్చువాలిటీయేనా? అలా అయితే బతుకులో బాగుప డ్డట్లే. ఇచ్చిన సమయం దాటి ఇరవై నిమిషాలయింది. ఇంకా అతగాడి అయిపూ అజా లేదు. ఎంతసేపని ఎదు రుచూడాలి అతని కోసం? ఎంతసేపీ కంచి గరుడసేవ? అతనసలొస్తాడా? రాడా? అతను ఇంత తీరిగ్గా వొస్తాడని తెలిస్తే - తనూ ధీమాగానే వొచ్చేవాడు. అనవసరంగా తొందరపడి వొచ్చేశాడు. ముందు రావడమంటే ఆము దమో మందో తాగడమంత బాధన్నమాట!

'సారూ!'

ఆ పిలుపు తనకోసమే అని గ్రహించడమేమిటి, 'నా పేరు నారూ, చారూ, సాంబారూ ఏమీ కాదు' అని బుస్సుమన్నాడు. అంతలోనే 'ఇరవై నాలుగొచ్చిందా సారూ?' అని అడిగేశాడవతలి వ్యక్తి.

'నాకేం తెలీదు. మీరూ నాలాగే వెయిటరుకండి...' వేళాకోళం ధ్వనించింది గోపాలం కంఠంలో.

'గాలివీస్తే ఎగిరిపోయేలా వున్నాను. నన్ను వెయిట రంటారేం? నా వెయిటు...'

'ఆ వెయిటరు కాదు'

'ఐతే హోటల్లో వెయిటరా?' రోషంగా చూశాడు.

'అబ్బ! వెయిటరంటే వెయిట్... నిరీక్షణ చేసేవా డని...'

'అలా అన్నారు బావుంది. నా పేరు బీమారావు'

'మీరు భీముళ్ళా లేరే? కొంపతీసి ఇన్సూరెన్స్ ఏజం ట్లేమిటి?' పారిపోబోయాడు.

'ఛ! నేనలాటివాడ్ని కానండీ. జంటిల్మన్‌నండీ. నా బస్సొచ్చేస్తూంది. నే పోతా సారూ...' అని అతను బస్సు వెనక పారిపోయాడు.

హు...! ఆర్టీసీ బస్సులేనా వొస్తున్నాయి కానీ అత గాడు మాత్రం ఏతెంచడు! ఛీ! మనుషులకి కాలం విలువ ఎప్పుడు తెలుస్తుందో! ఈ దేశంలో - మనుషులకి తమ సమయం విలువా తెలియదు, ఎదుటివాడి కాలం విలువా తెలియదు. సమయపాలన నెరుగని దరిద్ర దేశం. మిత్రుణ్ని తిట్టుకోలేక దేశాన్ని తిట్టుకోసాగాడు. ఎవరికైనా అమ్మ తరవాత దేశమే కదా తిట్టుకోడం అయ్యాక - కాఫీ కూడా తాగకుండా కటిక నిరీక్షణ చేయ వలసి వచ్చిన తన దౌర్భాగ్యానికి నిట్టూర్పు విడవసా గాడు. ఆ నిట్టూర్పు సగంలో ఉండగా...

'ఏమండోయ్! ఎయిటీవన్నొచ్చిందా?'

'నేను ఏమండోయ్‌ని కాను. నా పేరు గోపాలం'

'గోపాళంగారూ! ఎయిటీవన్'

'గోపాళం ఏమిటి? గంగాళంలా. మీకు పలకడం రాదా సరిగ్గా'

'అలాటి మాట్లాడకండి. నాక్కోపమొచ్చేస్తుంది'

'వొస్తే?' కవ్విస్తున్నట్లడిగాడు.

'కోపమొస్తే నేను మనిషిని కాను'

'రాకపోయినా...'

అతను ఛర్రున లేచాడు. 'అంటే నేనెప్పుడూ మని షిని కానన?'

'నేనలా అన్లేదు. ఊరికే ఎందుకూ అలా సీరియస్సు యిపోతారూ?'

'సీరియస్సా?' నిర్ఘాంతపోయాడు.

'ఆహా... సీరియస్సే. సీరియస్సంటే తప్పేమిటీ?' తేలికగా అనేశాడు గోపాలం.

'తప్పా, తప్పున్నరా! ఎదురుగా మనిషిని పెట్టుకుని సీరియస్సంటారా! కళ్ళు కనిపించడంలేదూ?'

'అంటాను. అన్నాను' మొండిగా చెప్పాడు గోపాలం. 'నా కళ్ళు కనపడుతున్నాయి... నా చెవులు వినపడుతున్నాయి' పాట పాడాడు.

'అనీగానే సరికాదు. అర్థం తెలుసుకు వినాలి. సీరి యస్సనాలంటే - టెలిగ్రాం రావాలి. జబ్బు చెయ్యాలి. చచ్చిపోవాలి. సీరియస్సంటే స్ట్రెయిట్‌మీడియట్లీ అనీని. ఇదేమీ తెలుసుకోకుండా శుభ్రంగా ఉన్న నన్ను పట్టుకుని సీరియస్సంటారా?' గద్దించాడు.

'మా ఫ్రెండు తరపున నేను క్షమాపణలు కోరుతు న్నాను శ్రీ సీరియస్‌గారూ! గోపాలం, పదం' అంటూ అతన్నాటో ఎక్కించేసి... అప్పుడడిగాడు శేఖరం... 'అసలు... గొడవేమిటీ?'

'నీ మూలంగానే. చెప్పిన టైముకి రాలేదు నువ్వు. బస్టాప్‌లో నువ్వొచ్చేవరకూ ఎలా కాలక్షేపం చేయాలీ? ఓ పెద్దాయన్ని మంచిగా పలకరించబోతే కస్సుమన్నాడు. దాంతో - మంచికి మాటలు పుట్టవని - వాళ్ళని రెచ్చ గొట్టే మార్గాలెన్నుకున్నాను. ఔనూ... అరగంట [illegible]ం చేస్తావా? నీకు టైమ్ విలువ బొత్తిగా తెలియనట్లుందె... నా టైము తినేశావు కదా...'

'మిస్టర్ గోపాల్! నేనరగంట ఆలస్యంగా రావడం కాదు, నువ్వు ముందొచ్చావ్' నవ్వాడు శేఖర్.

'లేదు... నువ్వే లేటుగా వచ్చావ్...'

'కాదు... నువ్వు ముందొచ్చేశావ్'

నువ్వు లేటంటే నువ్వు ముందని వాళ్ళిద్దరూ కొంచెం సేపు మాట్లాడుకున్నాక ఆటో అతను తన వాచీ చూపించి నిజాన్ని నిగ్గు తేల్చాడు. అప్పుడు - గెలిచిన ఆనందంతో, గర్వంతో, ధైర్యంతో శేఖర్ గోపాలానికి క్లాసు తీసుకున్నాడు.

'కుక్క విశ్వాసమైన జంతువు. కాని... వాచీ జంతువు కాదు. అంచేత దానికి విశ్వాసముండాలని రూలేం లేదు. ఆ కాలయంత్రానికి నువ్వు సకాలంలో ఓవర్హాలింగ్ లాటి సేవలందించకపోతే అదీ నీకు సేవ లందించదనే సత్యాన్ని తెలుసుకో. తన విలువనీ అవసరాన్నీ నీకు గుర్తు చేద్దా మనే అది తప్పు టైము చూపెడుతూ ఉండి ఉంటుంది.'

లేచిన వేళ బాగులేదనుకున్న గోపాలం కిక్కురుమన కుండా భరించాడా పాఠాన్ని.




